
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శుక్రవారం 20 జూన్ 2025



నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు..

- ఎస్పీ మహేశ్ బి. గీతే - ఎస్‌హెచ్‌వోలతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్ బి.గీతే

సిరిసిల్ల క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మహేశ్ బి. గీతే అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో అన్ని పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితులపై నాన్ బెయిలబుల్ వారెంట్లు పకడ్బందీగా అమలుపరిచేందుకు కృషి చేయాలన్నారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరిస్తూ తగ్గించేందుకు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులలో త్వరగా పరిశోధన పూర్తిచేసి చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. పెండింగ్ కేసులలో ప్లాన్ ఆఫ్‌యాక్షన్, ఎస్‌వోపీ ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేసి కేసులు చేధించాలన్నారు. రౌడీ, హిస్టరీషీట్స్ ఉన్న వారిపై నిరంతరం నిఘా పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించి హిస్టరీ షీట్స్ ఓపెన్ చేయాలన్నారు. ప్రాసిక్యూషన్‌లో భాగంగా కోర్టు వారు జారీచేసిన నాన్‌బెయిలబుల్ వారెంట్లను నిందితులపై లేదా తప్పించుకుని తిరుగుతున్న నేరస్థులపై అమలుపరచడానికి అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. నాన్ బెయిలబుల్ వారెంట్లను త్వరగా ఎగ్జిక్యూట్ చేయడంవల్ల కేసు విచారణ విజయవంతంగా పూర్తిచేసి సకాలంలో బాధితులకు న్యాయం జరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రతి శుక్రవారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేయాలన్నారు. సాయంత్రం 6గంటల నుంచి 8గంటల వరకు తనిఖీలు చేసి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే జైలు శిక్షలు, జరిమానాలు తప్పవన్నారు. ఈ సమావేశంలో సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ, సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నై.. నై.. నైరుతి

- మురిపించి ముఖం చాటేసి..
- ముదురుతున్న నారుమడులు
- మాడిపోతున్న పత్తి విత్తనాలు
- దుక్కులు దున్ని దిక్కులు చూస్తున్నరైతులు
- ఇప్పటివరకు కురిసింది 80.3మిల్లీమీటర్ల వర్షం
- వానాకాలంలోనూ 37 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు



ఇల్లంతకుంటలో మొలకెత్తని పత్తి

జిల్లాలో ఈనెల 19 వరకు నమోదైన వర్షపాతం(మిల్లీమీటర్లలో)

మండలం	సాధారణం	కురిసింది	లోటు
రుద్రంగి	88.6	42.6	52.0
చందుర్తి	99.3	49.6	50.0
వేములవాడ రూరల్	86.0	24.8	71.0
బోయినపల్లి	79.3	25.4	68.0
వేములవాడ	89.9	17.8	80.0
సిరిసిల్ల	84.3	22.1	74.0
కోనరావుపేట	75.5	38.0	50.0
వీర్నపల్లి	71.4	23.7	67.0
ఎల్లారెడ్డిపేట	75.0	24.1	68.0
గంభీరావుపేట	74.4	31.5	58.0
ముస్తాబాద్	65.0	18.8	71.0
తంగళ్లపల్లి	89.8	25.1	72.0
ఇల్లంతకుంట	65.5	36.3	45.0
సగటు వర్షపాతం	80.3	29.2	64.0

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

రోహిణి కార్తెతోనే వర్షాలు కురిసి మురిపించిన నైరుతి మొఖం చాటేసింది. ఎండల తీవ్రత తగ్గనంటున్నది. ఈసారి ముందస్తుగానే నైరుతి ఆగమనం అనడంతో రైతులు ఎంతో ఆనందంతో సాగు పనులు మొదలుపెట్టారు. వానాకాలం సీజన్ ప్రారంభమై పదిహేనురోజులు దాటినా వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన పడుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2.43లక్షల ఎకరాల్లో వివిధ పంటలుసాగు చేయడానికి సిద్ధమయ్యారు. తొలకరి జల్లులు పలకరించడంతో రైతులు దుక్కులు దున్నుకొని ఆరుతడి పంటలకు విత్తనాలు వేసుకున్నారు. జిల్లాలో ఇప్పటికే 25వేలఎకరాల్లో పత్తి విత్తనాలు వేసుకున్నారు. 1.84ఎకరాల్లో వరి సాగు కోసం ఐదువేల ఎకరాలు నారుమడులు సిద్ధం చేసుకున్నారు. వర్షాలు లేక జిల్లాలో నాట్లు మొదలు కాలేదు. ముందస్తుగానే వేసుకున్న పత్తి విత్తనాలు భూమిలోనే మాడిపోతున్నాయి మొలక వచ్చిన పత్తి మొక్కలు వాడిపోతున్నాయి. భూగర్భజలాలు అందుబాటులో లేకపోవడంతో పాటు జిల్లాలోని శ్రీ రాజ రాజేశ్వర మిడ్ మానేరు, అన్నపూర్ణ అనంతగిరి ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో నీళ్ల అడుగంటడంతో వరి సాగు వైపు రైతులు వెనకడుగు వేశారు.

2.43 లక్షల ఎకరాల్లో వానాకాలం సాగు..

జిల్లాలో వానాకాలంలో 2లక్షల 43వేల 773 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయడానికి రైతులు సిద్ధమయ్యారు. వరిసాగు లక్షా84వేల 860ఎకరాలు, మొక్కజొన్న 1,600 ఎకరాలు, పత్తి 49,760ఎకరాలు, కందులు 1,155 ఎకరాలు, పెసర 79 ఎకరాలు, ఇతర పంటలు 6,304 ఎకరాలు, ఇతర పంటలు 6,900 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనాలు వేశారు. వానాకాలం సాగుకు ఎరువులు 56,060 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అంచనాలు వేశారు. యూరియా 25,370 మెట్రిక్ టన్నులు, డీఏపీ 3,460 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 22,390 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 4,115 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 725 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అంచనాలు వేశారు ప్రస్తుతం జిల్లాలో పత్తి 25ఎకరాల్లో విత్తనాలు వేసుకున్నారు. నాట్ల కోసం ఐదువేల ఎకరాల్లో నారుమడులు సిద్ధం చేసుకున్నారు. నారుమడులు వర్షాలు లేకుంటే ముదిరిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరికొందరు రైతులు విత్త నాలు తెచ్చుకున్నామని, వర్షాల కోసం ఎదురు చూస్తున్నామని చెబుతున్నారు.

మొలక దశలోనే పత్తి..

జిల్లాలో వర్షాలు లేకపోవడంతో భూమిలో తేమశాతం పూర్తిగా తగ్గిపోయి, పత్తివిత్తనాలు మొలకెత్తని పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో 49,760ఎకరాల్లో పత్తి సాగుకు సిద్ధమైన రైతులు 25వేల ఎకరాల్లో విత్తనాలు వేసుకున్నారు. ఇందులో ప్రధానంగా ఇల్లంతకుంట, గంభీరావుపేట, ముస్తాబాద్, సిరిసిల, తంగళ్లపలి, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, బోయినపలి, చందుర్తి, కోనరావుపేటలో, రుద్రంగి, వేములవాడ, వేములవాడ రూరల్‌లో పత్తివిత్తనాలు వేసుకున్నారు. కొన్ని చోట్ల విత్తనాలు మొలకెత్తినా వర్షాలు లేకపో వడంతో ఎదుగుదలఆగిపోయింది. భూమిలో వేడి తగ్గకపోవడంతో విత్తనాలు మాడిపోయి. మళ్లీ విత్త నాలు వేసుకునే పరిస్థితి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.

లోటు వర్షపాతమే..

నైరుతి రుతుపవనాలు వచ్చి తొలకరి పలకరించినా వర్షాలు మాత్రం 8వ పేజీలో..

'రైతు భరోసా' నిధుల జమ

- లక్షా 10వేల 322 మంది రైతుల ఖాతాల్లో రూ.99.5కోట్లు..

- కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా రైతు భరోసా పథకం రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ వానాకాలం సీజన్‌లో సాగు కోసం రైతులకు ఉపయోగపడేలా రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద నిధులను విడుదల చేసిందని తెలిపారు. జిల్లాలలో 13 మండలాల్లో ఇప్పటివరకు లక్షా10వేల 322 మంది రైతుల బ్యాంక్‌ల ఖాతాల్లో రూ.99.5 కోట్లు జమ అయ్యాయని కలెక్టర్ తెలిపారు.

విధుల నిర్లక్ష్యం.. దుమాల ప్రిన్సిపాల్‌పై చర్యలు

- ఎన్ఈఎస్‌టీఎస్‌కు సరెండర్ - ఉత్తర్వులు జారీ

ఎల్లారెడ్డిపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన మండలంలోని దుమాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ మంజీద్‌పై టీజీఈఎంఆర్ఎస్ కార్యదర్శి సీతామహాలక్ష్మీ చర్యలు చేపట్టారు. ప్రిన్సిపాల్‌ను నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్‌కు సరెండర్ చేస్తూ గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. దుమాల పాఠశాలలో పదిహేను ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించడంతో ఇటీవల వారు పాఠశాల ఎదుట పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేపట్టారు. క్షేత్రస్థాయిలో విచారణ నివేదికల ఆధారంగా టీజీఈఎంఆర్ఎస్ కార్యదర్శి సీతామహాలక్ష్మి చర్యలు తీసుకున్నారు. కోనరావుపేట మండలం మరిమడ్ల ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్ రామ్‌సూరత్ యాదవ్‌కు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులో పేర్కొన్నారు.

వాహన ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలి

- మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రజనిదేవి

వీర్నపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రహదారులపై నడిచే వాహనాలకు అన్ని ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రజనీదేవి అన్నారు. వీర్నపల్లి మండలంలో వాహనాల తనిఖీ చేపట్టి ధ్రువీకరణ పత్రాలు సరిగాలేని వాహనాలను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. ప్రతి వాహనదారుడు రోడ్డుట్యాక్స్, ఇన్సూరెన్స్, పర్మిట్, లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మారుమూల ప్రాంతాల్లో వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉంటే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఆమె వెంట ఆర్టీఏ సిబ్బంది ఉన్నారు.

సెస్ ఏఈ, లైన్‌మెన్‌లపై చర్యలు తీసుకోవాలి

- ముఖ్యమంత్రికి ట్విట్టర్ ద్వారా ఫిర్యాదు

కోనరావుపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండల సెస్ ఏఈ, లైన్‌మెన్‌లపై చర్యలు తీసుకోవాలని కోనరావుపేట మండలంలోని కొలనూరు గ్రామానికి చెందిన ఓరుగంటి శంకర్ ట్విట్టర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ కొలనూరు గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ లోడ్ ఎక్కువైందని రైతుల పొలాల వద్ద ఉన్న స్టార్టర్లను సంబంధిత రైతులకు సమాచారం ఇవ్వకుండా సెస్ సిబ్బంది తీసుకెళ్లారని ఆరోపించారు. రైతులు ఈ విషయమై లైన్‌మెన్ శ్రావణ్‌ను అడగగా ఏఈ తీసుకొని రమ్మన్నారని చెప్పడం వల్ల తీసుకెళ్లామని అంటున్నారని అన్నారు. ఎలాగైనా రైతులు స్టార్టర్లను తిరిగి ఇవ్వాలని కోరినా సరైన సమాధానం ఇవ్వడం లేదని ఆరోపించారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అటవీ ప్లాంటేషన్ సర్వేను అడ్డుకున్నరైతులు

- వెనుదిరిగిన అధికారులు



అటవీ అధికారులను అడ్డుకున్న రైతులు 6

వేములవాడలో ముగిసిన కూల్చివేతలు

- కొనసాగుతున్న శిథిలాల తొలగింపు



శిథిలాలను తరలిస్తున్న కూలీలు 7

రాజన్న గోశాలలో నిత్యం కోడెలను పర్యవేక్షించాలి

- జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి రవీందర్‌రెడ్డి



అవగాహన కల్పిస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాలయానికి సంబంధించిన రెండు గోశాలల్లో కోడెలను నిత్యం పర్యవేక్షిస్తూ సంరక్షించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి కోరారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి దేవాలయానికి సంబంధించిన తిప్పాపూర్ గోశాలతోపాటు దేవాలయానికి సమీపంలోని గోశాలలో పని చేసేందుకు ఇటీవల ఎంపిక చేసిన వారికి గోశాలల్లో చేపట్టాల్సిన పనులు, చేయాల్సిన విధులపై జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్‌తో కలిసి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డిలు అవగాహన కల్పించారు. అనంతరం గోశాలల్లో పనిచేసేందుకు నియామకమైన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పశువుల సంరక్షణపై పశువైద్యాధికారి డాక్టర్ శ్రీధర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించడంతో పాటు ప్రతి రోజు కోడెలకు పచ్చిగడ్డి, ఎండుగడ్డి, దాణా, మూడు సార్లు ఇవ్వాల్సి ఉంటుందని వాటికి నిత్యం పరిశుభ్రమైన నీరును అందుబాటులో ఉంచాలని సూచించారు. కోడెలు ఉండే పరిసరాలు ఎప్పుడు పరిశుభ్రంగా ఉండేల చూసుకోవాలని సూచించారు. అలాగే కోడెల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ గోశాలలోని పశువైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. గోశాలలో పశువైద్యాధికారి సహాయకులు అటెండర్‌లు అందుబాటులో ఉంటారని తెలిపారు. గోశాలలోని కోడెలకు సీజనల్‌గా అన్ని టీకాలు వేసేలా చూసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి సూచించారు.

అసమానతలు రూపుమాపడానికి రాహుల్‌గాంధీ కృషి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



తిప్పాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో అసమానతలను రూపుమాపడానికి రాహుల్‌గాంధీ చేస్తున్న కృషి మరిచిపోలేనిదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌లో రాహుల్‌గాంధీ జన్మదినాన్ని పురష్కరించుకుని కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆశీస్సులు ఆయనపై ఉండాలని అకాంక్షించారు. వేములవాడ నియోజకవర్గానికి గత ఎన్నికల సమయంలో రెండుసార్లు వచ్చారని గుర్తు చేశారు. రోడ్డు షోటలో మేడిపల్లి మండల కేంద్రానికి, ఎన్నికల సమయంలో వేములవాడకు పట్టణానికి ఒకసారి వచ్చారని అన్నారు. తన గెలుపు కోసం, ప్రభుత్వం అధికారంలోకి రాండం కోసం ప్రజలను చైతన్యం చేసేందుకు ఆయన ప్రసంగించిన తీరు మర్చిపోలేనిదని కొనియాడారు. ప్రపంచంలో ఎవరికి సాధ్యం కానీ విధంగా పాదయాత్ర చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు, ముంబై నుంచి మేఘాలయ వరకు పాదయాత్ర చేసి దేశంలోని పేద ప్రజల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి దానికి అనుగుణంగా సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారని వివరించారు. దేశంలో అసమానతలను తొలగించి దేశ వ్యాప్తంగా కులగణన చేయాలని సంకల్పించిన గొప్ప నాయకుడని, అందులో భాగంగానే రాష్ట్రంలో కులగణన చేపట్టడం జరిగిందని తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన మాట ప్రకారం బీసీ రిజర్వేషన్ అమలు చేయడం జరిగిందని రానున్న రోజులు ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం మరిన్ని సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకురానుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కనికరపు రాకేష్, సంద్రగిరి శ్రీనివాస్, కూరగాయాల కొమురయ్య, గూడూరి మధు, పాత సత్యలక్ష్మీ, పీర్‌మహ్మద్, రాజు తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్‌లో అధికారులు, సిబ్బందికి యోగా శిక్షణ



కలెక్టరేట్‌లో యోగా శిక్షణ పొందుతున్న అధికారులు, సిబ్బంది

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రోజు యోగా సాధనతో ఆరోగ్యంగా ఉంటారని అయూష్ యూనాని డిస్పెన్సరీ యోగా శిక్షకులు శ్రీనివాస్, స్వప్నలు కోరారు. కలెక్టరేట్‌లో అయూష్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దశాబ్ధి ఉత్సవాల్లో భాగంగా గురువారం కామన్ యోగా ప్రోటోకాల్‌పై జిల్లా అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. యోగా అసనాలు, ప్రాణాయామం, ముద్రలు, ధ్యానం తదితర అంశాలతోపాటు ప్రతిరోజు యోగా చేయడం వలన కలిగే లాభాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి, అయూష్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ శశిప్రభ, సహాయ నోడల్ అధికారి డాక్టర్ సౌమిని, డాక్టర్ శ్వేత, డాక్టర్ స్వరూప, డాక్టర్ కళ్యాణి, డీపీఎం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూసమస్యలు పరిష్కారం

ఇల్లంతకుంట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రెవన్యూ సదస్సులతో రైతుల భూసమస్యలు పరిష్కారం అవుతున్నాయని తహసీల్దార్ ఫారూఖ్ పేర్కొన్నారు. మండలంలోని రహీంఖాన్‌పేట, దాచారం గ్రామాలలో గురువారం రెవన్యూ సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిపై విచారణ జరిపి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రైతుకు భూదార్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దాచారం గ్రామంలో 47 దరఖాస్తులు, రహీంఖాన్‌పేట గ్రామంలో 48 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐలు సంతోష్‌కుమార్, శశికుమార్, కృష్ణ, సింగారెడ్డిలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

- యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టర్ నటేశ్



మాట్లాడుతున్న యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టర్ నటేశ్

సిరిసిల్ల క్రైం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టర్ నటేశ్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని అపరెల్ పార్క్ వద్ద షీటీం ఆధ్వర్యంలో జిల్లా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, చిన్నపిల్లల రక్షణ విషయంలో ఎస్పీ పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారన్నారు. జిల్లాలో మానవ అక్రమ రవాణా నిర్మూలించడానికి ఏహెచ్‌టీయూ ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. మహిళలపై అత్యాచారం, అసభ్యంగా దాడిచేయడం, అనుచితంగా తాగడం, తదితర లైంగిక నేరాల కేసుల్లో, మానవ అక్రమ రవాణాను నిరోధించడంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ప్రత్యేకత కలిగి ఉందన్నారు. మహిళల భద్రతకు షీటీం ఏర్పాటుతో పలు రకాల కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. మహిళలు, యువతులు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా పోలీసులను సంప్రదించాలన్నారు. నేరుగా సంప్రదించలేని వారెవరు ఎవరైనా డయల్ 100, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ 8712656392, షీటీం 8712656425కి సమాచారం ఇవ్వాలన్నారు.

రోడ్డు వెడల్పు పనులకు మోక్షం కలిగేనా?

- నేడు గ్రామసభ

ఇల్లంతకుంట, జూన్ 19(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని బైపాస్ రోడ్డు వెడల్పు పనులకు ఇంటి యాజమానులు సహకరించేనా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. బైపాస్ రోడ్డు వెడల్పు పనులకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ రూ 50లక్షలు కేటాయించి, పనులు ప్రారంభించారు. పనులు కొంతమేర జరుగగా విద్యుత్ స్థంబాలు అడ్డుగా ఉండటంతో వాటిని తొలగించడానికి కొంత ఆలస్యం జరిగింది. రోడ్డు వెడల్పునకు అడ్డుగా ఉన్న 31మంది ఇంటి యజమానులకు నోటీసులు జారీచేశారు. నోటీసులు ఇచ్చి రోజులు గడిచినా ఎవరు వెడల్పునకు అడ్డుగా ఉన్నవాటిని తొలగించలేదు. దీనితో శుక్రవారం గ్రామసభ నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈమేరకు ఇంటి యజమానులకు సమాచారం అందించారు. ఇంటి యజమానులు మాత్రం తాము వెనుకకు జరుగడానికి సిద్ధంగా ఉన్నప్పటికిని అన్ని రోడ్లను గతంలో సూచించిన విధంగా వెడల్పు చేయాలని కోరుతున్నారు.

మద్యం మత్తులో బైక్‌కు నిప్పంటించిన యువకుడు



దగ్ధమవుతున్న బైక్

మల్యాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రాజారంలో మద్యం మత్తులో ఓ వ్యక్తి గురువారం తన ద్విచక్రవాహనాన్ని దహనం చేశాడు. జగిత్యాల మండలం టీఆర్‌నగర్‌కు చెందన కలీం అనే వ్యక్తి రాజారంలోని హనుమాన్ ఆలయం వద్ద తన పల్సర్ వాహనాన్ని స్టార్ట్ చేయడానికి ప్రయత్నించాడు. అది స్టార్ట్ కాకపోవడంతో మద్యం మత్తులో ఉన్న అతడు దానికి నిప్పటించాడు. దీంతో మంటలు చెలరేగగా స్థానికులు జగిత్యాలలోని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. వాహనం పూర్తిగా దగ్ధం అయినట్లు స్థానికులు తెలిపారు.

చిన్నబోనాల శివారులో చిరుత సంచారం..

● పాదముద్రలను గుర్తించిన రైతులు



చిన్నబోనాల శివారులోని పొలంలో చిరుత అడుగులు

సిరిసిల్ల రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లఅర్బన్ పరిధిలోని చిన్నబోనాల గ్రామశివారులోని వ్యవసాయ పొలాల్లో చిరుతపులి సంచరిస్తుండడంతో రైతులు భయంతో వణికిపోతున్నారు. చిన్నబోనాల గ్రామ శివారులోని సుద్దగండి ప్రాంతంలోని వ్యవసాయపొలాల్లో గురువారం తెల్లవారుజామున చిరుతపులి పాదముద్రలను రైతులు గుర్తించారు. ఈ విషయాన్ని రైతులు తాజా మాజీ కౌన్సిలర్ బోల్గం నాగరాజుగౌడ్ దృష్టికి తీసుకరావడంతో అక్కడివెళ్లి పరిశీలించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు అక్కడివెళ్లి అడుగులను పరిశీలించి చిరుతపులి అడుగులుగా గుర్తించారు. రాత్రిపూట రైతులు వ్యవసాయ పొలాల వైపు వెళ్లవద్దని అటవీశాఖ అధికారులు కోరారు. ఎలాగైనా చిరుతను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

శంకరపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళఅదృశ్యంపై కేశవపట్నం పోలీస్ స్టేషన్లో కేసునమోదైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామానికి చెందిన బొంతల లావణ్య ఈ నెల10న ఇంటినుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. లావణ్య భర్త రాజు చుట్టు పక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఎలాంటి ఆచూకీ దొరకలేదు. దీంతో రాజు కేశవపట్నం పోలీస్ స్టేషన్లో లావణ్య అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు మిస్సింగ్ కేసునమోదు చేసుకొనిదర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తడి ఆరని కన్నీటి ధార..

● ఐదు దశాబ్దాలుగా అంతర్గాం కాందిశీకుల ఆర్తనాదాలు

● ఏళ్లు గడిచినా పరిష్కారానికి నోచుకోని సమస్యలు

నేడు అంతర్జాతీయ శరణార్థుల దినోత్సవం

అంతర్జాతీయ శరణార్థుల దినోత్సవాన్ని అంతర్గాం కాందిశీకులు జరుపుకోవ డానికి సిద్ధపడుతున్నారు. ఐదు దశాబ్దాలుగా పునరావాస సంక్షేమ పథకాలకు నోచుకోవడం లేదు. మిల్లుల మూసివేతతో ఉపాధి కోల్పోయి నిరుద్యోగం, ఆకలి, అనారోగ్యాలతో బతుకు భారమై కాలం వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు ఇప్పటికైనా ఆదు కోవాలని వారు వేడుకుంటున్నారు. ఈ అంతర్జాతీయ శరణార్థుల దినోత్సవం నుండైనా అణగారిన అంతర్గాం కాందిశీకుల జీవితాల్లో వెలుగులు నిండాలని ఆశిద్దాం...

గోదావరిఖని, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాందీశీకులు కన్నీటి ధారలు ఆరడం లేదు.. వారిని కరుణించిన ప్రభుత్వాలే కన్నీట ముంచాయి... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు శ్రీలంక, బర్మాకు (మయన్మార్) బతుకుదెరువు కోసం వలస వెళ్లారు. 1970 ప్రాంతంలో అక్కడ కరువు ఏర్పడడంతో భారత ప్రభుత్వం వారిని కాందీశీకులుగా తీసుకువచ్చి దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉపాధి కల్పించింది. ఈ క్రమంలో పెద్దపల్లి జిల్లా అంతర్గాంలో స్పిన్నింగ్, వీవింగ్ మిల్లులు ఏర్పాటు చేసి వెయ్యి మందికి ఉపాధి కల్పించింది. వీవింగ్ మిల్లులో 509 మంది, స్పినింగ్ మిల్లులో 434 మంది కాందిశీకులు ఉద్యోగాలు చేశారు. అంతర్గాంలో కార్మికుల కోసం క్వార్టర్లు, ఇతర వసతులు కల్పించారు. 90వ దశకం వరకు అంతా సాఫీగా జరిగింది.



మూతపడిన స్పిన్నింగ్ మిల్లు



మూతపడిన వీవింగ్ మిల్లు

● **మిల్లుల మూసివేతతో కష్టాలు**

యాజమాన్య లోపాలు, అవినీతి వల్ల స్పిన్నింగ్, వీవింగ్ మిల్లులు నష్టాల పాలయ్యాయి. 1989లో వీవింగ్ మిల్లును మూసివేశారు. దీంతో కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఇందులో పని చేసిన 197 మంది కాందిశీకులు దుర్భర దరిద్ర్యాన్ని, వృద్ధాప్యాన్ని అనుభవిస్తున్నారు. 162 మంది కార్మికుల కుటుంబాలు వివిధ కారణాలతో మృతి చెందారు. స్పిన్నింగ్ మిల్లును 1991లో లే ఆఫ్ ప్రకటించి మూసివేశారు. ఇందులో పని చేసిన 434 మంది కార్మికులు రోడ్డున పడ్డారు.

● లక్ష్మీ స్పిన్నింగ్ మిల్లులో 1970 నుంచి 1991 వరకు కార్మికురాలిగా పని చేసింది. అంతర్గాంలో అప్పుడు ఆమెకు క్వార్టర్ ఇచ్చారు. ఆ పునరావాస కాలనీలో ఉన్న క్వార్టర్ 1994లో కూలి పోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు తమ బకాయిలు వస్తాయని ఎదురు చూస్తున్న లక్ష్మి అదేస్థలంలో ఓ రేకుల షెడ్డు వేసుకుని జీవిస్తున్నది.

ఈ రెండు మిల్లుల కార్మికుల వేతనాల బకాయిలు కూడా చెల్లించలేదు. క్వార్టర్లు శిథిలమయ్యాయి. ఆ స్థలాలకు పట్టాలు ఇవ్వలేదు. దీంతో వారికి నిలువ నీడ కరువైంది.

ఇళ్లన్నా ఇవ్వండి..: రామారావు, బర్మ, శ్రీలంక కాందిశీకుల సంఘం ప్రధాన కార్యదర్శి



జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ ప్రభుత్వాలు బర్మ, శ్రీలంక కాందిశీకులకు అంతర్గాంలో పునరావాసం కల్పించాయి. 350 ఎకరాల్లో వెయ్యి ఇళ్ల కట్టి వెయ్యి మందికి ఉపాధి కల్పించింది. ఇప్పుడు అంతర్గాం మిల్లులకు సంబంధించి భూములన్నీ అన్యాక్రాంతవుతున్నాయి. అక్రమార్కులు కబ్జాలకు పాల్పడుతున్నారు. 50ఏళ్ల తరువాత కూడా కాందిశీకులం పునరావాసం కోసం వేడుకుంటున్నాం. ఉపాధి, ఉద్యోగాలు కల్పించడం సాధ్యం అయినా, కాకపోయినా తలదాచుకునేందుకు ఇంటి స్థలాన్ని, ఇల్లును ఇప్పించాలని కోరుకుంటున్నాను.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు..

● ఒకరి మృతి



నరేశ్(ఫైల్)

తంగళ్లపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామశివారులో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. వేములవాడ మండలం చింతల్ ఠాణ ఆర్అండ్ఆర్‌కాలనీకి చెందిన కుర్మ నరేశ్(36) ద్విచక్రవాహనంపై చిన్నలింగపూర్‌లో రైల్వేలైన్ పనులు చేయడానికి వెళ్తున్నాడు. ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో నరేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 వాహనంలో జిల్లా ప్రధానఆసుపత్రికి తరలించి చికిత్సచేస్తుండగా మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య మమత, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

వీణవంక, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన ఆరెపల్లి అనూష(26) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం.. అనూష కొంతకాలంగా అత్తగారింటికి వెళ్లకుండా తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పలుమార్లు అత్తగారింటికి వెళ్లాలని సూచించించారు. అత్తగారింటికి వెళ్ళడం ఇష్టంలేక అనూష 16వతేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వరంగల్ ఆసుపత్రికి తరలించగా బుధవారం చికిత్స పొందుతూ మృతిచెందింది. అనూష తండ్రి చిలువేరు నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎరువుల దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ దాడి



ముస్తాబాద్ ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ముస్తాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎస్సై గణేశ్, మండల వ్యవసాయాధికారి దుర్గరాజు, తంగళ్లపల్లి వ్యవసాయాధికారి సంజీవ్‌లు గురువారం తనిఖీచేశారు. మండల కేంద్రంలోని పలుదుకాణాల్లో లైసెన్స్‌లు, స్టాక్ రిజిష్టర్లు, బిల్ బుక్కులు తనిఖీ చేశారు. డీలర్లు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అమ్మవద్దని హెచ్చరించారు. రశీదు లేకుండా ఏది అమ్మవద్దని, రైతులకు ఉపయోగపడే వాటినే విక్రయించాలని సూచించారు. అక్రమంగా నిలువ ఉంచిన విత్తనాలను అమ్మితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

గ్రామపంచాయతీ ఎదుట మహిళల బైఠాయింపు



ఓదెల గ్రామపంచాయతీ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న మహిళలు

ఓదెల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం 10వ,వార్డు మహిళలు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మురికి కాలువల నిర్మాణం చేపట్టారని, ఇందులో మంచినీటి నల్లాల మరమ్మతులు చేపట్టలేదని మహిళలు తెలిపారు. మురికి కాలువల్లో నల్లాల నీరు వృథాగా పోతుండడంతో కాలువలు నిండి నీటినిలువతో దుర్వాసన, దోమలు అధికమవుతున్నాయని తెలిపారు. నీటినిలువ ఉండకుండా మంచినీటి నల్లాల మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తర లిస్తున్న ఒక ట్రాక్టర్‌ను గురువారం ఖాజీపూ ర్‌లో పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మందుబాబుల ఆగడాలు

● పాఠశాల మైదానాలు, పల్లెప్రకృతి వనాల్లో అడ్డా ● ప్రమాదకరంగా పగిలిన గాజుముక్కలు

● ఆందోళన చెందుతున్న విద్యార్థులు, ప్రజలు ● గస్తీ ఏర్పాటు చేయాలని వేడుకోలు



ఎల్ఎండీలోని శిశుమందిర్ పాఠశాల మైదానంలో తాగి పగలకొట్టిన మద్యం సీసాల ముక్కలు



ఎల్ఎండీలోని పాఠశాల మైదానంలో వెలుతురు కోసం వేసిన మంట, అందులో వేసిన ఖాళీ మద్యం సీసాలు

తిమ్మాపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీకాలనీ మందుబాబులకు అడ్రస్‌గా మారింది. ఉదయం, సాయంత్రం తేడాలేకుండా మందుబాబులు మందు తాగేందుకు పాఠశాలలు, కూలిన ఎస్ఆర్ఎస్పీ క్వాటర్లు, పల్లె ప్రకృతివనాలను అడ్డాలుగా మార్చుకుంటున్నారు. రాత్రి అయిందంటే చాలు ద్విచక్రవాహనాలు, కార్లలో వచ్చి ఈస్థలాల్లో మద్యం తాగుతూ ఉంటారు. మద్యం బాటిళ్లను పగలగొట్టి వెళుతుండటంతో గాజుముక్కలు ప్రజలకు ప్రమాదంగా మారుతు న్నాయి. ఉదయం వాకర్స్, మైదానంలో ఆటలు ఆడేవారు ఈ మద్యం సీసా ముక్కలతో ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడ గుచ్చుకుంటాయోనని ఆందోళనచెందుతున్నారు. రాత్రి సమయంలో అటు వైపుగా విద్యుత్‌దీపాలు సరిగా లేకపోవడంతో చీకట్లో మందుబాబులు ఆడిందే ఆటగా మారిందని స్థానికులు అంటున్నారు. రాత్రి సమయాల్లో బయటకు వెళ్లేందుకు భయమేస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పోలీసులు ఇటువైపు ప్రత్యేకంగా గస్తీ ఏర్పాటు చేసి మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన కందుల యశ్వంత్ కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామంలో ఏప్రిల్9న తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా వెంటనే కరీంనగర్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌ను ఉపయోగించి ఫోన్‌ను రికవరీ చేశారు. కరీంనగర్ రూరల్ సీఐ ఎ నిరంజన్‌రెడ్డి గురువారం ఫోన్‌ను బాధితుడికి అందజేశారు. ఫోన్‌ను గుర్తించి, స్వాధీనం చేసుకోవటంలో కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.



బాధితుడికి సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

హత్య కేసులో ఇద్దరికి ఏడేళ్ల జైలు

జగిత్యాల క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో గొడవపడి వ్యక్తి మృతికి కారణమైన ఇద్దరికి ఏడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం రాయికల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మాజీ పేటకు చెందిన సావన్‌పెల్లి శేఖర్(28) అనే వ్యక్తి వ్యవసాయం చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. 2022 మార్చి 22న శేఖర్ తన మిత్రుడు నాగభూషణంతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతకగా గ్రామ శివారులో శేఖర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కిరణ్ కుమార్ కేసు నమోదు చేయగా జగిత్యాల రూరల్ సీఐ కృష్ణ కుమార్ దర్యాప్తు చేశారు. పోలీసుల దర్యాప్తులో శేఖర్ అనే వ్యక్తిని అతడి స్నేహితులు రస రాజేశం, బలిజ నాగభూషణంలు మద్యం మత్తులో గొడవ పడి పదునైన ఆయుధంతో పొడిచి హత్యకు పాల్పడ్డట్లు గుర్తించారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు నరేష్, కిరణ్ కుమార్‌లు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ఇద్దరు ముద్దాయిలు రాజేశం, నాగభూషణంలకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ముద్దాయిలకి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

చోరీ కేసులో నిందితుడికి 6 నెలల జైలు

కరీంనగర్ క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని శ్రీ శివభక్తి ఆంజనేయ స్వామి దేవాలయంలో పంచలోహ విగ్రహం, గోముఖం, ఇతర వస్తువులు దొంగత నానికి పాల్పడిన కేసులో నిందితుడు గట్టుబూత్కూర్‌కు చెందిన ఎగుర్ల గట్టయ్యకు కరీంనగర్ ఏడీఎం కోర్టు మెజిస్ట్రేట్ 6 నెలల జైలుశిక్ష, 400 రూపాయల జరిమానా విధించారని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. చోరీ కేసులో నిందితు డిని జనవరి 6న అరెస్టు చేయగా గురువారం తీర్పు వెలువడిందని తెలిపారు. నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి, కోర్టు కానిస్టేబుల్ మౌనికలను సీఐ అభినందించినట్లు తెలిపారు.

రూ.7400 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూన్ 19 (ఆంధ్ర జ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7400 పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు ఐదుగురు రైతులు 76క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వార గరిష్ఠ ధర రూ.7400, కనిష్ఠ ధర రూ.7200 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఎనిమిదేళ్లుగా రేషన్‌కార్డు కోసం ఎదురుచూపులు

● బియ్యం కోసం ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబం

చిగురుమామిడి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చిగురుమామిడి మండలంలోని రామంచ గ్రామానికి చెందిన దర్శనం మౌనిక-సహదేవ్ దంపతులు ఎనిమిది సంవత్సరాలుగా రేషన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నారు. రోజుకూలి చేసుకునే వీరిది పేద కుటుంబం. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పేదప్రజలకు ఇచ్చే రేషన్ కార్డులు అర్హులకు అందడం లేదనడానికి వీరు ప్రత్యక్ష ఉదాహరణ. రోజువారి ఆహారం కోసం దుకాణాల్లో డబ్బులుపెట్టి బియ్యం కొని తెచ్చుకుంటున్నారు. దీంతో కూలి డబ్బులుకాస్తా తినే తిండికే సరిపోతున్నాయని వారు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

● కూలి డబ్బులు బియ్యానికే సరిపోతున్నాయి..

- దర్శనం మౌనిక-సహదేవ్..

మేము అనేక సంవత్సరాలుగా రేషన్‌కార్డు కోసం దరఖాస్తులు చేసుకుంటూనే ఉన్నాం. ఐనప్పటికీ మాకు రేషన్‌కార్డు రాలేదు. రోజు కూలి పనులు చేసుకుంటూ వచ్చిన డబ్బులతో సగం డబ్బుతో బియ్యం తీసుకువచ్చి కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. చేతికి పని దొరకని రోజు పస్తులుండుడే. అధికారులు మాపై దయ చూపి రేషన్‌కార్డు ఇచ్చి ఆదుకోవాలి.

పనిదొరకని రోజు పిల్లలు వారు పస్తులుండాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి అర్హులైన వారిని గుర్తించి రేషన్‌కార్డులు అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఇంటి ఎదుట పిల్లలతో మౌనిక, సహదేవ్ దంపతులు

బావిలో పడి ఒకరి మృతి

ధర్మారం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్ గ్రామా నికి చెందిన గొర్ల కాపరి పెద్ది మల్లయ్య(61) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. గురువారం ఉదయం గొర్ల కాపలకు గ్రామ శివారులోకి వెళ్ళాడు. ఎండ తీవ్రత అధికంగా ఉండగా బావి వద్ద ఉన్న చెట్టుకింద సేదదీరుతూ అందులో పడి మృతి చెందాడు. మిగితా కాపర్లు వచ్చి చూసే సరికి బావిలో చెప్పులు తేలి ఉండడం, కర్ర బావి వద్ద ఉండడంతో అందులో పడినట్లు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మల్లయ్య భార్య పెద్ది పోశవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

సుడా నిధులతో గ్రామాల అభివృద్ధి

● గుండ్లపల్లి స్టేజివద్ద వీధి దీపాలను ప్రారంభించిన ఎమ్మెల్యే, సుడా చైర్మన్



స్ట్రీట్ లైట్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

గన్నేరువరం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సుడా నిధులతో సుడా పరిధిలోని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గుండ్లపల్లి స్టేజి నుండి గన్నేరువరానికి వెళ్లే ప్రధాన రహదారిలో రూ.20లక్షల సుడా నిధులతో ఏర్పాటు చేసిన వీధిదీపాలను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డితో కలిసి ఆయన గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుడా పరిధిలోని గ్రామాలకు మహర్దశ పట్టనున్నదని అన్నారు. సుడా నిధులతో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టామని అన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సుడా పరిధిలోని అన్ని గ్రామాలను అభివృద్ధి పరిచేందుకు నిధుల మంజూరుకు కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, నాయకులు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, కొమ్మెర రవిందర్ రెడ్డి, ముల్కల మల్లేశం, బేతెల్లి రాజేందర్‌రెడ్డి, వంగల సత్తిరెడ్డి, బొల్లి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

అటవీ ప్లాంటేషన్ సర్వేను అడ్డుకున్న రైతులు

● వెనుదిరిగిన అధికారులు



రోడ్డుపై బైఠాయించిన రైతులు

వీర్నపల్లి, జూన్ 19 (ఆంధ్ర జ్యోతి): వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామంలో 30ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న అటవీభూముల్లో ప్లాంటేషన్ కోసం సర్వే చేయద్దని అటవీ శాఖ అధికారులను రైతులు అడ్డుకున్నారు. తమ భూముల్లో సర్వే చేయద్దంటూ రైతులు రోడ్డుపై భీష్మించుకు కూర్చున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంత అటవీ భూమిసాగులో ఉందని తెలుసు కునేందుకే సర్వే చేస్తున్నామని అల్మాస్‌పూర్, గొల్లపల్లి సెక్షన్ అధికారులు పద్మలత, సక్కారాం రైతులకు వివరించారు.

అయినా రైతులు ఒప్పుకోకపోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. రైతులు వినిపించుకోకపోవడంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించి తదుపరి చర్యలు తీసుకుంటామని అధి కారులు తెలిపారు. రాత్రిపూట భూములను సాగు చేయకుండా బేస్ క్యాంపు సిబ్బంది, వాచర్లు గస్తీ నిర్వహిస్తున్నారు.

వేములవాడలో ముగిసిన కూల్చివేతలు

● మిగిలిన శిథిలాల తొలగింపు



కూల్చివేతలో భాగంగా సగం తొలగించిన భవనం

వేములవాడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని ప్రధానరహదారి విస్తరణలో భాగంగా చేపట్టిన ఇళ్లు, భవనాల కూల్చివేత పనులు దాదాపుగా పూర్తయ్యాయి. రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానం ముందు నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న నిర్మాణాలను తొలగించే ప్రక్రియను అధికార యంత్రాంగం ఆదివారం ప్రారంభించగా, బుధవారం రాత్రికి కూల్చివేతలు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న రోడ్డును 80అడుగుల మేరకు విస్తరించే క్రమంలో 243ఇళ్లను తొలగించాల్సి ఉండగా, ఇందులో 80ఇళ్లకు సంబంధించిన యజమానులు కోర్టును ఆశ్రయించి స్టేపొందడంతో వాటిని మినహాయించి మిగతా వాటిని అధికారులు కూల్చివేశారు. రోడ్ల వెడల్పుకోసం సేకరించాల్సిన స్థలంమేరకు మార్కింగ్ చేసి ప్రొక్లెయినర్లతో కూల్చివేశారు. మిగిలిపోయిన నిర్మాణం సైతం దెబ్బతినే అవకాశం ఉండడంతో కొందరు ఇంటియజమానులు నష్టపోయే భాగాన్ని కూల్చివేసేందుకు తమకే అవకాశం ఇవ్వాలని కోరడంతో అధికారులు అందుకు అంగీకరించారు. పాక్షికంగా కోల్పోతున్న ఇళ్లు, ఇతర నిర్మాణాలలో సంబంధిత యజమానులు కూలీల సహాయంతో తొలగింపు పనులు చేపట్టారు. ఇదిలాఉండగా ఇప్పటివరకు కూల్చివేత పూర్తయిన వాటికి సంబంధించిన శిథిలాలను తరలించాల్సి ఉండగా, అందుకు సంబంధిత నిర్మాణాల యజమానులకే అవకాశం ఇచ్చామని మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తెలిపారు. ఇందుకోసం నాలుగు రోజులు సమయం ఇస్తున్నామని, అప్పటిలోగా శిథిలాలు తరలించాలని లేనిపక్షంలో తామే శిథిలాలను తరలిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఉమ్మడి నాలుగు జిల్లాల వాలీబాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న పుట్ట మధు

పెద్దపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పరికిపండ్ల నరహరి ఐఏఎస్ తండ్రి పరికిపండ్ల సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆలయఫౌండేషన్ ఆధ్వర్యంలో బసంత్‌నగర్‌లో ఉమ్మడి నాలుగు జిల్లాల వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. గురువారం ప్రారంభమైన ఈపోటీలకు ముఖ్య అతిథులుగా మాజీ జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ నాయకులు కౌశిక్ హరి, బీజేపీ నాయకురాలు కందుల సంధ్య రాణి, బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష హాజరయ్యారు. వారు మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతగానో దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీలకు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, నిజామాబాద్ జిల్లాల నుంచి 32జట్లు పాల్గొంటున్నాయి. ఆలయ ఫౌండేషన్ సీఈవో రమేశ్ బాబు, అడిషనల్ సీఈవో మిట్టపల్లి రాజేంద్ర కుమార్, డిప్యూటీ సీఈవో కీర్తి నాగార్జున, ఫౌండేషన్ సభ్యులు పరికిపండ్ల రాము, లక్ష్మణ్, పుప్పాల దయానంద్, రామస్వామి, సోము శ్రీనివాస్, జాగిరి శ్రీకాంత్, కన్నం వెంకటేష్, కమలాకర్ రెడ్డి, శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్, పెద్దపల్లి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

● ఎస్పీ అశోక్ కుమార్



వాహనానికి నంబరు ప్లేట్ బిగిస్తున్న పోలీసులు

జగిత్యాల క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నంబర్ ప్లేట్ లేకుండా, కొత్త వాహనాలకు రిజిస్ట్రేషన్ చేయించకుండా నడిపితే చర్యలు తప్పవని ఎస్పీ అశోక్ కుమార్ హెచ్చరించారు. ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలమేరకు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో గురువారం పోలీసులు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడుపుతున్న 306వాహనదారులను గుర్తించి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాహన నంబర్లను ట్యాంపరింగ్‌చేస్తే వాహనాలను సీజ్‌చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని ఎస్పీ కోరారు.

సిరిసిల్ల జిల్లాకు ఆర్చరీ అకాడమీ



ఆర్చరీ అకాడమీ ప్రారంభానికి సిద్ధమైన మినీ స్టేడియం

నేడు ప్రారంభించనున్న రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్

సిరిసిల్ల టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో వాలీబాల్ అకాడమీకి అనుమతులు లభించాయి. గత సంవత్సరం నుంచే జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్ జిల్లా కేంద్రంలో ఆర్చరీ అకాడమీ ఏర్పాటుకు ప్రయత్నాలు చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ చొరవతో ఎట్టకేలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ నుంచి ఆర్చరీ అకాడమీ ఏర్పాటుకు సానుకూలంగా స్పందన వచ్చింది. ఇటీవల సిరిసిల్ల మినీ స్టేడియంలో ఆర్చరీ అకాడమీ ఏర్పాటుకు, విద్యార్థుల శిక్షణకు కావాల్సిన సౌకర్యాలను స్పోర్ట్స్ అథారిటీ అధికారులు పరిశీలించారు. అనుకూల వాతావరణం ఉండడంతో ఆర్చరీ అకాడమీ ఏర్పాటుకు అనుమతులను మంజూరు చేశారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ఆర్చరీ అకాడమీని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రారంభించనున్నారు. అకాడమీ ప్రారంభోత్సవం అనంతరం ఆర్చరీ అకాడమీలో చేరికలకు 14 నుంచి 16 ఏళ్లలోపున్న 20 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నారు.

కబడ్డీ అకాడమీ మంజూరు చేయాలి

మదన్, కబడ్డీ అసోసియేషన్ సహాయ కార్యదర్శి



గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా కబడ్డీ క్రీడకు ప్రాధాన్యం ఉంది. కబడ్డీ క్రీడకు ప్రభుత్వాలు ప్రోత్సాహం అందించాలి. జిల్లాలో వాలీ బాల్, ఆర్చరీ అకాడమీ రావడం ఆనందంగా ఉంది. జిల్లాలో కబడ్డీ అకాడమీని మంజూరు చేయాలి. కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ప్రత్యేక క్రీడా శిబిరాలతో శిక్షణ ఇస్తున్నాం. ప్రభుత్వం, అధికారులు కూడా ప్రోత్సాహం అందిస్తే జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణిస్తారు.

మరిన్ని క్రీడా అకాడమీలు రావాలి..

సీహెచ్ శ్రీకుమార్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు



రాజన్న సిరిసిల్ల జిల్లాకు మరిన్ని క్రీడా అకాడమీలు రావాలి. క్రీడలకు పుట్టినిల్లు అయిన రాజన్న సిరిసిల్ల జిల్లాలో క్రీడాకారులకు కొదవలేదు. గ్రామీణ స్థాయి నుంచి జిల్లా కేంద్రం వరకు ప్రతి క్రీడలో క్రీడాకారులు ప్రావీణ్యం సాధిస్తున్నారు. ప్రభుత్వం, జిల్లా అధికా రులు మరింత ప్రోత్సాహం ఇస్తే జాతీయ స్థాయిలో విజయాలను సాధిస్తారు. వాలీబాల్ అకాడమీతో పాటు అర్చరీ అకాడమీ ప్రారంభం కానుండడం ఆనందంగా ఉంది.

మాజీ ఎంపీటీసీ కుంటయ్య ఆరోపణల్లో నిజం లేదు..

● రూరల్ సీఐ మొగిలి



మాట్లడుతున్న రూరల్ సీఐ మొగిలయ్య

తంగళ్లపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మాజీఎంపీటీసీ కుంటయ్య చేసిన ఫిర్యాదును పట్టించుకోలేదని పోలీసులపై అసత్యప్రచారం, తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని రూరల్ సీఐ మొగిలి అన్నారు. బుధవారం సీఐ విలేకరుల సమావేశంలో మాట్లడుతూ తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ మాజీఎంపీటీసీ కర్కబోయిన కుంటయ్య 2023జూలై 25వ తేదిన లేని భూమిని తనకు మల్యాల నాగరాజు రిజిస్ట్రేషన్ చేశాడని ఫిర్యాదు చేశాడన్నారు. దీనిపై స్పందించి మల్యాల నాగరాజుపై చీటింగ్ కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలు సేకరించి న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేసినట్లు తెలిపారు. అలాగే తంగళ్లపల్లికి చెందిన గంగ కిష్టరెడ్డి 2024 డిసెంబర్ 12వతేదిన కర్కబోయిన కుంటయ్య భూమి విషయంలో మోసం చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. కుంటయ్యపై కేసు నమోదుచేసి దర్యాప్తు జరిపి న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఈక్రమంలో పోలీసులపై తప్పుడు ఆరోపణలు, వదంతులు ప్రచారం చేస్తున్నారని అన్నారు. పోలీసులు న్యాయబద్ధంగా, నిష్పక్షపాతంగా స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. పోలీసులు భూమి సంబంధించిన అంశాలు, సివిల్ వివాదాల్లో ఎటువంటి జోక్యం చేసుకోలేదని, చట్టపరిధిలో విచారించారని తెలిపారు. భూమిఅంశాలు, సివిల్‌వివాదాలను న్యాయస్థానంలో పరిష్కరించుకోవాలని తెలిపారు.

రేపు జాబ్ మేళా

గణేశ్‌నగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు కరీంనగర్‌లోని రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్ కరీంనగర్‌లో ఉద్యోగాలు కల్పించడానికి 21న శనివారం తనిష్క్ జ్యువెలర్స్ 4వ అంతస్తు, గెస్ట్ హౌస్ ఎదురుగా, సవరన్ వీధి కరీంనగర్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి వై.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్ లో 2 లైఫ్ ప్లానింగ్ అధికారి, అప్రెంటిస్, ఎల్‌పిఓ 20 పోస్టులు ఖాళీలు ఉన్నాయని, వీటికి మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఏదైనా డిగ్రీ ఆపై చదివి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, వారి వయస్సు 20 సంవత్సరాలు, నెలసరి వేతనం 20 వేలు ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు జూన్ 21న ఉదయం 11 గంటలకు సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ఆర్అండ్ బి గెస్ట్‌హౌస్ ఎదురుగా, తనిష్క్ జ్యువెలర్స్ 4వ అంతస్తు, కరీంనగర్ కు వచ్చి పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెం. 9848168440, 6281363909 నందు సంప్రదించాలని తెలిపారు.

గుడుంబా పట్టివేత

వెల్గటూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలంలోని జగదేవపేట గ్రామా నికి చెందిన దారంగుల మల్లేష్ గుడుంబా అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ ఎవరైనా గుడుంబా తయారు చేసినా, అమ్మినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

విలోచవరంలో పోచమ్మ బోనాలు

మంథనిరూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విలోచవరంలో గురువారం పోచమ్మతల్లికి సామూహిక బోనాలను సమర్పించారు. వర్షాకాలం పంటల సాగు ముందు పిల్లా పాపలతో గ్రామంలోని పోచమ్మ తల్లికి బోనాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. గ్రామస్థులంతా డప్పుల చప్పుళ్లతో గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న పోచమ్మ తల్లిని దర్శించుకున్నారు.



పోచమ్మతల్లి వద్దకు వెళ్తున్న గ్రామస్థులు

రాజన్న నిత్యాన్నదాన సత్రానికి విరాళం అందజేత



ఏఈవో శ్రావణ్‌ను కలిసి చెక్కులు అందజేసిన దాతలు

వేములవాడ కల్చరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి నిత్యాన్నదానానికి దాతలు విరాళాన్ని అందజేశారు. సుప్రీంకోర్టులో అడ్వకేట్‌గా చేస్తూ న్యూఢిల్లీలో నివాసం ఉంటున్న బోయినపల్లి మండలం వర్ధవల్లి గ్రామానికి చెందిన పీచర శ్రీహర్ష, ఆయన స్నేహితుడు శ్రీకృష్ణకుమార్ కుటుంబసభ్యులతో కలిసి రాజన్నను దర్శించుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం రాజన్న నిత్యాన్నదాన సత్రానికి చెరో లక్ష రూపాయల చొప్పున ఏఈవో శ్రావణ్‌కుమార్‌కు అందజేశారు. వారివెంట కాంగ్రెస్ జిల్లా నాయకుడు చింతపల్లి శ్రీనివాస్‌రావు ఉన్నారు.

నిధుల గోల్‌మాల్‌పై చర్యలేవి?

● జగిత్యాల జిల్లా వైద్య విధాన పరిషత్‌లో రూ.7కోట్లు దుర్వినియోగం

● ఏడాది అవుతున్నా ఎటూ తేలని వ్యవహారం

● తాజాగా సూపరింటెండెంట్ ఫిర్యాదుతో పోలీసుల ఆరా



విచారణ జరుపుతున్న అధికారులు(ఫైల్)

జగిత్యాల అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా వైద్య విధాన పరిషత్‌లో గత ఏడాది జరిగిన రూ.7కోట్ల నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో సొమ్ము రికవరీ కాలేదు. ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించగా ఉన్నతాధికారులు వైద్యవిధానపరిషత్ రికార్డు అసిస్టెంట్ యాసిన్‌ను సస్పెండ్ చేసి రెండున్నర కోట్లు రికవరీ చేసినా మిగతాసొమ్ము సంగతి అధికారులు పట్టించుకోలేదు. తాజాగా గతమేనెలలో టీవీవీపీ (తెలంగాణ వైద్యవిధానపరిషత్) జగిత్యాల సూపరింటెండెంట్ ఎస్పీ అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేయడంతో నిధుల గోల్‌మాల్ వ్యవహారం మళ్లీ ముందుకు వచ్చింది.

● అవినీతి బయట పడిందిలా..

కోరుట్ల టీవీవీపీ సూపరింటెండెంట్ గత సంవత్సరం ఒక చెల్లింపు విషయంలో వైద్య విధానపరిషత్‌కు చెందిన బ్యాంక్ ఓచర్‌పై 8వేల రూపాయలు రాసి ఇచ్చారు. రికార్డు అసిస్టెంట్ దానిని 28లక్షల రూపాయలుగా మార్చి ఇదే డిపార్ట్‌మెంట్‌కు చెందిన మరో వినియోగం లేని అకౌంట్‌లో వేయడంతో ఈ అక్రమాల వ్యవహారం బయటకు వచ్చింది. దీంతో ఈ విషయమై ఉన్నతాధికారులు విచారణ జరపడంతో వైద్యవిధాన పరిషత్‌కు చెందిన యాసిన్ అనేఉద్యోగి ఈ అకౌంట్‌ను వాడుతున్నట్లు గుర్తించారు. వెంటనే ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీని నియ మించారు. అయితే ఈ విచారణలో ఉద్యోగుల ఖాతాలో జమ చేయా ల్సిన డీఏ, ఏరియర్స్, సీపీఎస్ ఏరియర్స్, మరియు రెగ్యులర్ ఏరి యర్స్‌తోపాటు వివిధ ఖాతాల్లో వేయాల్సిన ఏడుకోట్ల సొమ్ము పక్క దారి పట్టినట్లు విచారణ కమిటీ సభ్యులు గుర్తించారు. అయితే వినియోగంలో లేనిఖాతాకు సొమ్ము మళ్లించిన యాసిన్ తనదగ్గరి వ్యక్తుల ఫోన్ నంబర్‌ను ఖాతాకు లింక్ చేసి దానిపై యూపీఏ అకౌంట్‌క్రియేట్ చేసి డబ్బులు డ్రా చేసినట్లు అధికారులు గుర్తించారు.

● 2020 నుంచి ఆడిట్ చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి..

జగిత్యాల జిల్లా వైద్యవిధాన పరిషత్‌లో రికార్డు అసిస్టెంట్ యాసిన్ 2020నుంచి లావాదేవీలు పర్యవేక్షిస్తుండగా ఆడిట్ అధికారులు 2022నుంచి ఆడిట్ చేశారు. మరో రెండు సంవత్సరాల ఆడిట్ నిర్వహించి మరింత లోతుగా విచారణ జరిపితే మరింత అవినీతి బయట పడే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు. నిధుల గోల్‌మాల్‌పై గతంలో విచారణ జరిపిన కమిటీ సభ్యులకు బ్యాంక్అధికారులు సహకరించక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. వినియోగంలో లేని ఖాతాను తిరిగి తెరిచేందుకు జిల్లా అధికారుల సంతకం ఫోర్జరీ చేశారా అనే కోణంలో విచారణ జరిపితే అన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

● ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు

- రామకృష్ణ, సూపరింటెండెంట్ టీవీవీపీ, జగిత్యాల

జగిత్యాల అర్బన్, జగిత్యాల జిల్లా తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో గతసంవత్సరం జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాల్సిందిగా జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. పోలీసుల విచారణ అనంతరం అక్రమాలకు పాల్పడిన వారిపై ప్రభుత్వ ఆదేశాలకు మేరకు చర్యలు చేపడతాం.

ద్విభాషా పుస్తకాలు

● తెలుగు, ఇంగ్లీషులో ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు

● విద్యార్థులకు ఉపయోగకరం



కరీంనగర్ టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాలుగేళ్ల క్రితం నుంచే ఇంగ్లీష్ మీడియం ప్రారంభించారు. అయితే ఇప్పటి వరకు తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో చదవడం కష్టంగా మారింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాఠాలను అర్థం చేసుకోలేక పోతున్నారని విద్యాశాఖ అధికారులు గుర్తించారు. దీన్ని అధిగమించడానికి పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను ఒక పక్క ఇంగ్లీష్, మరో పక్క తెలుగులో ముద్రించి ఇవ్వాలని నిర్ణయించింది. గత ఏడాది 1 నుంచి 10వ తరగతి వరకు గణితం, ఫిజిక్స్, బయాలజీ, సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాలను ఇంగ్లీష్, తెలుగు భాషల్లో అచ్చు వేసి పంపిణీ చేసింది.

పేజీలు ఎక్కువ ఉండడంతో రెండు భాగాలుగా..

ఈ యేడాది కూడా గణితం, జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం, సాంఘిక శాస్త్రం పాఠ్య పుస్తకాల్లోని మొత్తం చాప్టర్లను ఒక పేజీ ఇంగ్లీష్, దాని పక్కనే మరో పేజీలో తెలుగు భాషల్లో ముద్రించారు. పేజీలు పెరగడంతో వీటి పరిమాణం, బరువు ఎక్కువ అవుతుండడంతో విద్యార్థుల సౌలభ్యం కోసం రెండు భాగాలుగా విభజించారు. మొదటి భాగం జూన్ నుంచి అక్టోబరు వరకు ఎస్ఏ-1 పరీక్షల కోసం పార్ట్-1గా, రెండో భాగం నవంబరు నుంచి మార్చి వరకు ఎస్ఏ-2 పరీక్షల కోసం (పార్ట్-2)గా విభజించారు.

ఆకర్షణీయంగా..

పాఠశాలలు పునఃప్రారంభమైన 12వ తేదీ నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. పుస్తకాల కవర్ పేజీ ముద్రణలు చాలా ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ పుస్తకాల్లో పాఠ్యాంశాలకు అనుగుణంగా రంగురంగుల బొమ్మలు చూడగానే పాఠం సారాంశం అర్థమయ్యేలా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. దీనికి తోడు పాఠ్యపుస్తకాల్లో ప్రతీ పాఠానికి ఒక క్యూ ఆర్ కోడ్ ఉంటుంది. దీనిని మొబైల్ ద్వారా స్కాన్ చేసి ఆపాఠానికి సంబంధించిన వీడియోలను వీక్షించవచ్చు. తెలుగు మీడియం నుంచి వచ్చిన విద్యార్థులు ఇంగ్లీష్ మీడియంలో సులువుగా చదివి రాణిస్తారని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

విద్యార్థులు అవగాహన పెంచుకోవచ్చు

చకినాల రామ్మోహన్, ఎస్ఏ గణితం, తిమ్మాపూర్ మండలం



పాఠ్యపుస్తకాలను రెండు భాషల్లో ముద్రించడం విద్యార్థులకు ఉపయోగకరంగా ఉన్నాయి. ఇంగ్లీష్ మీడియంలో వెనకబడిన విద్యార్థులు తెలుగులో చదివి అవగాహన పెంచుకోవచ్చు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వనిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ అంబేద్కర్ యువజనసంఘం జిల్లా అధ్యక్షుడు క్యాదాసి ప్రభాకర్ డిమాండ్‌చేశారు. గురువారం నగరంలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. చాలావిద్యాసంస్థల్లో విద్యార్థులకు ఆటస్థలం లేదని, పార్కింగ్ లేదని అన్నారు. విద్యాహక్కుచట్టాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో 25శాతం సీట్లు ఎస్సీ ఎస్టీవర్గాల పిల్లలకు ఉచితంగా కేటాయించాలని, స్టేషనరీ కూడాఉచితంగా అందచేయాలని చట్టం చెబుతుందన్నారు. ఈ చట్టాన్ని అమలు చేయని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీబీఎస్ఈ చట్టం ప్రకారం ప్రతిపాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ అసోసియేషన్‌లో ఇద్దరు తల్లిదండ్రులకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. అసోసియేషన్ సూచనమేరకే ఫీజులు పెంచాలని తెలిపారు. నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై సంబంధిత అధికారులు తగినచర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్షచేపడతామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్రకార్యదర్శి మీసాలసాయిలు, జిల్లాప్రధానకార్యదర్శులు మైసనిమనోహర్, మానాలనారాయణ, చామనపల్లిచంద్రశేఖర్,ఉపాధ్యక్షులు గండిగణేష్, తాటిపల్లి జంపన్న తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలను పరిశుభ్రంగా ఉంచాలి

● జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ



కొత్తపల్లి ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ

భగత్‌నగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అన్నారు. కొత్తపల్లి ప్రాథమికఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. అవుట్ పేషంట్ రిజిస్టర్‌లు, ఇతర రికార్డులను పరిశీలించారు. ఎన్‌సీడీ క్లినిక్‌లో అసంక్రమిత వ్యాధుల రిజిస్ట్రరైన రెడ్ పుస్తకం, బ్లూ పుస్తకాలను పరిశీలించారు. అందులో రక్తపోటు, షుగర్ వ్యాధిగ్రస్తుల వివరాల నమోదును పరిశీలించి వారికి మందులు ఇస్తున్న తీరును పరిశీలించారు. ఫార్మసి స్టోర్‌లో సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల నిల్వలను పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్‌ను, ప్రసూతి గది పరిశుభ్రతలను పరిశీలించి అందులో ఉండాల్సిన అత్యవసర మందులను పరిశీలించారు. మొదటి కాన్పులను సిజేరియన్ చేయించు కోవడంవల్ల కలిగే సమస్యలను వివరించి సాధారణ ప్రసవాలు ఆరోగ్యకేంద్రాల్లో జరిగేట్లు గర్భవతులను వారి కుటుంబసభ్యులను ప్రోత్సహించాలన్నారు.

● ఫీల్డ్ ట్రైనింగ్..

బీఏఎంఎస్ డాక్టర్లకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగే ఆరోగ్యకార్యకలాపాలపై ఫీల్డ్ ట్రైనింగ్‌లో భాగంగా అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీవోఎంహెచ్ఎన్ డాక్టర్ సన జవేరియా, కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి నజియా, డీపీవో ఎన్‌హెచ్ఎం స్వామి, సాగర్, బీఏఎంఎస్ డాక్టర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలి

గంభీరావుపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేటలో మిగిలి ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను గ్రామసభ ద్వారా చేయాలని గురువారం తహసీల్దార్ మారుతిరెడ్డికి స్థానికులు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో అప్పట్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయగా, 38 ఇళ్లు మిగిలాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. మిగిలిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్వహించి, అర్హుల జాబితా సిద్ధం చేయాలన్నారు. ఉన్నట్టుండి డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు సర్వే చేస్తున్నారని, అలా కాకుండా గ్రామసభ ద్వారానే మిగిలిన ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముద్రకోళ అంజనేయులు, పోషవ్వ, భారతవ్వ, మంజుల, లక్ష్మి, శ్యామల, గౌసియా బేగం, సుజాత, పుష్పలత, మౌనిక, దేవవ్వ, దశరథం, చిరంజీవి తదితరులు ఉన్నారు.

సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శికి సన్మానం

సిరిసిల్ల టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో గురువారం పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి గుంటి వేణును దళిత లిబరేషన్ ఫ్రంట్, కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా దళిత లబిరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడి సుదర్శన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌ఎఫ్ జిల్లా నాయకులు గుండెల దేవరాములు, కాంగ్రెస్ పార్టీ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప నాయకులు పాల్గొన్నారు.

చిన్నారులకు ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశం..

ఎల్లారెడ్డిపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లోని తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు వద్ద మహారాష్ట్రకు చెందిన కూలీ కట్టెల లచ్చయ్య వ్యవసాయ పనులు చేస్తున్నాడు. ఇటీవల కూలీ పనులు చేసే తల్లిదండ్రుల వద్దకు మహారాష్ట్ర నుంచి ఇద్దరు పిల్లలు అవంతి, ఆదర్శలు చేరుకున్నారు. చదువుకుంటే భవిష్యత్తు ఉంటుందని నచ్చజెప్పిన లక్ష్మణ్‌రావు ఇద్దరు పిల్లలను గురువారం మండలంలోని వెంకటాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతిలో చేర్పించారు. విద్యార్థుల చదువులకు అయ్యే ఖర్చులను తానే భరిస్తానని భరోసా కల్పించారు. దుస్తులు, పుస్తకాలు కొనిచ్చారు. బాగా చదువుకుని తల్లిదండ్రుల కలను సాకారం చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం కృష్ణహరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుబుక్కుల పంపిణీ

ఇల్లంతకుంట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కందికట్కూర్ గ్రామంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటుబుక్కులను పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో గురువారం జరిగిన కార్యక్రమంలో మెగాలైట్ ఇండస్ట్రీస్ యజమాని మొలుగూరి రాజు బుక్కులను అందజేశారు. పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బద్దం రవీందర్‌రెడ్డి, అనవేజు రాజు, నాయకులు యాస తిరుపతి, వెలిచాల జ్యోతి, కరుణాకర్‌రెడ్డి, నవీన్‌కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఇల్లంతకుంట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు రావని వైద్యాధికారి జీవనజ్యోతి పేర్కొన్నారు. మండలంలోని పొత్తూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో గురువారం ఇంటింటా పరిశీలించారు. మురుగునీటి కాలువలను శుభ్రం చేయాలని, త్రాగునీరు కలుషితం కాకుండా చూడాలని సూచించారు. సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కమ్యూనిటీ భవనంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. 39మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. జ్వర లక్షణాలు ఉన్న ఐదుగురి వద్ద రక్తనమూనాలు సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పిల్లల వైద్యుడు ప్రేమ్, హెచ్‌ఈవో వెంకటరమణ ప్రసాద్, పీహెచ్‌ఎన్ తారాబాయి, సూపర్‌వైజర్లు జవహార్, శోభారాణి, దివ్య, విజయ, సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడాలమ్మ కల్యాణ మహోత్సవం



పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రూరల్ మండలం బొల్లారం గ్రామంలో చౌడాలమ్మ కల్యాణ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. కల్యాణ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఇల్లంతకుంట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ ప్రణీత్‌గౌడ్ సూచించారు. మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో గురువారం మత్తువినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సమావేశం జరిగింది. ఈసందర్భంగా మత్తుపదార్థాలను తొలుత సరదా కోసం తీసుకోవడం జరుగుతుందని, కొద్దిరోజుల తర్వాత వీటికి బానిసలుగా మారుతారన్నారు. విద్యార్థులు తమ దృష్టిని చదువుపై కేంద్రీకరించాలని సూచించారు. మత్తుపదార్థాల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్‌గౌడ్, ప్రధానోపాధ్యాయిణి ప్రేమలత,ట టాస్క్‌ఫోర్స్ ఎస్సై శైలజలతో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీ

కోనరావుపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం కనగర్తి ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల వసతులు, నాణ్యమైన విద్యాబోధన అందుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వినోద్‌కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, సింగిల్ విండో వైస్‌చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, మాజీ సర్పంచ్ అనుపాటి బాపురెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వంగపల్లి దేవరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

చందుర్తి జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని ప్రధానోపాధ్యాయులు ఎస్. జలంధర్‌రెడ్డి అన్నారు. చందుర్తి మండలం నర్సింగాపూర్ ప్రాథమిక పాఠశాలలో జాతీయ పఠన దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో సామూహిక పుస్తక పఠనం చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత, కే. శ్రీధర్, బి. రాజు, ఎస్. రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

గంభీరావుపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సముద్రలింగాపూర్, గజసింగవరం ఆరోగ్య ఉప కేంద్రాల్లో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి, సూపర్‌వైజర్ మహిపాల్, సీహెచ్‌వో రమేష్, అమరావతి, అనూష, హేమ, భారతి, ఏఎన్‌ఎం రాణి, రాజేశ్వరి, అనుసూయ ఉన్నారు.

'శవ రాజకీయాలు మానుకోవాలి'

తంగళ్లపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ శవ రాజకీయాలు మానుకోవాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అంకుసాపూర్ మాజీ ఎంపీటీసీ కుంటయ్య మృతిపై దిగ్భ్రాంతిని వ్యక్తంచేస్తూ మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన శ్రద్ధాంజలి ఘటిస్తున్నామన్నారు. కుంటయ్య చావుతో మండలంలో శవ రాజకీయాలు చేస్తూ కేటీఆర్ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. చట్టం అందరికి ఒకే విధంగా వర్తిస్తుందనే విషయాన్ని కేటీఆర్ మర్చిపోయి కుంటయ్య మృతిలో కారణాలు వెతుక్కుంటూ కాంగ్రెస్ నాయకుల వల్లే మృతిచెందాడని అనడం బాధాకరమన్నారు. కుంటయ్య మృతికి కాంగ్రెస్ నాయకులకు, పార్టీకి ఎలాంటి సంబంధం లేదని, గతంలో వీరందరూ కలిసి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసుకునే వారని, దీంట్లో భాగంగా ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నట్లు వివరించారు. మరోసారి కాంగ్రెస్ నాయకులపై ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో మునిగేల రాజు, లింగాల భూపతి, పొన్నాల పర్శరాములు, ఆరెపల్లి బాలు, మీరాల శ్రీనివాస్ యాదవ్, చుక్క శేఖర్, కొత్త రవీందర్‌గౌడ్, హరికరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నై.. నై.. నైరుతి

(5వ పేజీ తరువాయి)

కురవకపోవడంతో జిల్లాలో 64 శాతం లోటు వర్షపాతమే నమోదైంది. గత సంవత్సరం 728.5 సాధారణ వర్షపాతానికి వర్షపాతానికి 896.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ సంవత్సరం జూన్ 1నుంచి 19వ తేది వరకు జిల్లాలో 64.0శాతం లోటువర్షపాతమే నమోదైంది. తొమ్మిది మండలాల్లో అధిక లోటు వర్షపాతం ఉంది. జిల్లాలో ఇప్పటివరకు 80.3 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా, 29.2 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. కురిసిన వర్షపాతం కూడా రైతులకు ఉపయోగకరంగా లేకుండా పోయింది.

జిల్లాలో ఖరీఫ్ సాగు లెక్కలు

మండలం	వరి	పత్తి	ఇతర	మొత్తం
గంభీరావుపేట	18,600	200	530	19,330
ఇల్లంతకుంట	24,000	12,500	1,970	38,470
ముస్తాబాద్	23,000	600	1,650	25,250
సిరిసిల్ల	4,900	850	103	5,853
తంగళ్లపల్లి	19,950	1,000	1,081	22,031
వీర్నపల్లి	8,360	400	32	8,792
ఎల్లారెడ్డిపేట	17,500	3,600	30	21,130
బోయినపల్లి	13,000	7,000	1,310	21,310
చందుర్తి	15,200	6,200	210	21,610
కోనరావుపేట	18,200	4,800	700	23,700
రుద్రంగి	5,900	3,400	805	10,105
వేములవాడ	5,200	5,010	368	10,578
వేములవాడ రూరల్	11,050	4,200	364	15,614
మొత్తం	**1,84,860**	**49,760**	**9,153**	**2,43,773**

వానాకాలంలోనూ ఎండలు..

వర్షాకాలం వచ్చినా ఎండలు మాత్రం తగ్గడం లేదు. జిల్లాలో ఇప్పటికి పగటి ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 36.7 నుంచి 37.0 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఉక్కపోతతో ప్రజలు సతమతం అవుతూనే ఉన్నారు. వర్షాలు ఎప్పుడు పడుతాయా అని రైతులతో పాటు సామాన్య జనం కూడా ఎదురుచూస్తున్నారు. ఇంకా ఎండాకాలాన్నే తలపిస్తోంది.

వర్షం పడకుంటే బాగా నష్టపోతాం..

- మామిడి తిరుపతి, రైతు ఇల్లంతకుంట



వానల కోసం ఎదురుచూస్తున్నాం. తొలకరి జల్లులతోనే పత్తి విత్తనాలు వేశాం. ఎకరానికి రూ.8వేలు ఖర్చుచేశాం. మొలకెత్త లేదు. వచ్చిన మొలకలు ఎండవేడికి వాడిపోతున్నాయి. వర్షం పడకపోతే బాగా నష్టపోతాం. మళ్లీ విత్తనాలు వేసుకోవాలి.

కూలీల ఖర్చులు పెరిగాయి..

- వజ్జపల్లి శ్రీనివాస్, కేశనపల్లి



దుక్కులు దున్నడానికి, విత్తనాలు వేసుకోవడానికి గతంలోకంటే కూలీల ఖర్చులు, పెట్టుబడులు పెరిగాయి. వర్షాలు పడుతాయని పత్తి విత్తనాలు వేశాం. అయినా వానలు పడకపోవడంతో మళ్లీ విత్తనాలు వేసుకోవాల్సి వస్తుందనే ఆందోళనగా ఉంది.

తొలగించిన రోడ్డును పరిశీలించిన తహసీల్దార్

వీర్నపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం అడవి పదిరలో వంతెన నిర్మాణ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు అదే గ్రామానికి చెందిన రైతు తన పొలం నుంచి రోడ్డు వేశారని జేసీబీతో మట్టి, పైపులను తొలగించాడు. గ్రామానికి రాకపోకలు బంద్ కావడంలో విషయం తెలుసుకున్న తహసీల్దార్ ముక్తార్‌పాషా రోడ్డును పరిశీలించారు. అనుమతి లేకుండా వంతెన వద్ద ఏర్పాటు చేసిన మట్టిని తొలగించడం తప్పని హెచ్చరించారు. పొలానికి సంబంధించిన పట్టా కాగితాలను కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. వెంటనే గ్రామస్థులకు ఇబ్బందులు లేకుండా మట్టి రోడ్డును తిరిగి ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు లేకపోవడంతో ప్రజలు నడిచేందుకు ఇబ్బందులు పడ్డారు.



తొలగించిన మట్టి రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

అధ్వానంగా రాగట్లపల్లి-నారాయణపూర్ రహదారి



కంకర తేలి ప్రమాదకరంగా మారిన రహదారి

ఎల్లారెడ్డిపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి- నారాయణపూర్ రహదారి కంకర తేలి ప్రమాదకరంగా మారింది. దారి పొడవునా అధ్వానంగా తయారైంది. కంకర లేచిపోయి గుంతలమయంగా ఏర్పడింది. వాహనదారులు ఆ దారి గుండా ప్రయాణించాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి దాపురించింది. వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రహదారి నిర్మాణంలో నాణ్యత లేమి వల్ల కంకర తేలి గుంతలు పడ్డాయని వాహనదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

డాక్టర్ రవీందర్‌రావుకు కన్నీటి వీడ్కోలు



నివాళులర్పిస్తున్న మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు



అంత్యక్రియలో పాల్గొన్న మాజీ గవర్నర్, ఎమ్మెల్యే తదితరులు

బోయినపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ జనరల్ సర్జన్, ప్రతిమ మెడికల్ కాలేజ్ డీఎంఈ డాక్టర్ రవీందర్‌రావు(75) అనారోగ్యంతో బుధవారం మృతిచెందగా, ఆయన పార్థివదేహాన్ని స్వగ్రామమైన బోయినపల్లి మండలం కొరెం గ్రామానికి గురువారం తీసుకువచ్చారు. రవీందర్‌రావు భౌతికకాయాన్ని చివరిసారిగా చూసేందుకు గ్రామ స్థులు తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు. డాక్టర్ రవీందర్‌రావు బంధువులు మహారాష్ట్ర మాజీ గవర్నర్, కేంద్ర హోంశాఖ మాజీ సహాయ మంత్రి చెన్నమనేని విద్యాసాగర్‌రావు, వినోద దంప తులు, కూతురుఅల్లుడు మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్ కుమార్-మాదవి దంపతులతో పాటు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీజేపీ నాయకులు చెన్నమనేని వికాస్‌రావు, సునీల్‌రావు, ప్రతాప రామకృష్ణలు ఘనంగా నివాళులు అర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..



రాచర్లబొప్పాపూర్‌లో భవనానికి సమీపంలో ఉన్న విద్యుత్ తీగలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలంలోని ఆయా గ్రామాల్లోని ఇళ్ల నిర్మాణాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో ఇటీవల పలువురు చిన్నారులు, యువకులు భవనాలపై తిరుగుతూ కరెంటు తీగలు తగిలి గాయాల పాలయ్యారు. ఇప్పటికైనా మరిన్నీ ప్రమాదాలు జరుగక ముందే సంబంధిత శాఖ అధికారులు విద్యుత్తు తీగలను మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

డ్రగ్స్, గంజాయి నిర్మూలనలో భాగస్వాములు కావాలి

- ఎస్పీ మహేశ్ బి. గీతే

సిరిసిల్ల క్రైం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి నిర్మూలనలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఎస్పీ మహేశ్ బి. గీతే అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నషా ముక్త్‌భారత్ అభియాన్‌లో భాగంగా తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ద్వారా జిల్లా వ్యాప్తంగా కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేశామన్నారు. విద్యార్థులు, యువతకు డ్రగ్ అవేర్నెస్ వీక్‌లో భాగంగా శుక్రవారం నుంచి వారంరోజుల పాటు ప్రతి పోలీస్‌స్టేషన్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 20న జిల్లా, మండల కమిటీల సమావేశం, 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం, 22న డ్రగ్ హాట్ స్పాట్‌లలో అవగాహన, 23న మొక్కలు నాటడం, 24న స్లోగన్, రైటింగ్ కాంపిటేషన్, 225న పెయింటింగ్ కాంపిటేషన్, 26న అంతర్జాతీయ మాదక ద్రవ్య సేవన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ, ప్రతిజ్ఞ సమావేశం, తదితర కార్యక్రమాలు రూపకల్పన చేశామన్నారు. డ్రగ్స్ నిర్మూలన కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతిఒక్కరు భాగస్వాములై భావితరాలకు మంచి భవిష్యత్ అందించాలన్నారు. మత్తు పదార్థాలకు, గంజాయికి దూరంగా ఉండాలన్నారు.

సదరం క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి రాధిక జైస్వాల్

సిరిసిల్ల క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సదరం క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి రాధిక జైస్వాల్ అన్నారు. గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రిలో నాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. దివ్యాంగులను ఇంటి వద్ద నుంచి సదరం క్యాంపునకు తీసుకొని వచ్చి ధ్రువీకరణ పత్రాలు ఇప్పించాలన్నారు. దివ్యాంగులకు వైద్యులు, సిబ్బంది సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ లక్ష్మీనారాయణ, డాక్టర్ చీకోటి సంతోష్, డాక్టర్ సాధన, డాక్టర్ నెమలి కళ్యాన్, డీసీవో ఎ. చిరంజీవి, లోక్‌అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎంపిక పోటీలు



ధర్మారంలో విద్యార్థులను ఎంపిక చేస్తున్న ఉపాధ్యాయులు

కోనరావుపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం ధర్మారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్ గురువారం నిర్వహించినట్లు ఎంఈవో మురళి నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని హకీంపేట్ ఆదిలాబాద్, కరీంనగర్‌లో గల స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు సెలక్షన్ నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో సెలెక్ట్ అయిన వారు ఈనెల 23నుంచి 26 వరకు జిల్లాస్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారన్నారు. 22 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా వారిలో 14 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్లు సంతోష్, అజయ్, రేణుక, వనిత, వెంకటేష్, పీఈటి హెప్సిబా, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

పల్లెల్లో మెరుగైన వైద్య సేవలు..

వీర్నపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మారుమూల అటవీ పల్లెల్లో వ్యాధుల నివారణ కోసం వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మెరుగైన సేవలను అందిస్తున్నామని మండల వైద్యాధికారి డాక్టర్ స్నేహ అన్నారు. వీర్నపల్లి మండలం జవహర్‌లాల్ తండా, సీతారాంనాయక్ తండా, మద్దిమల్ల తండా గ్రామాలలో ప్రభుత్వ వైద్యసిబ్బందితో గురువారం మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా 167మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రజల కు సికిల్‌సెల్, రక్తహీనత అంశాలపై అవగాహన కల్పించారు. జ్వరంతో బాధ పడుతున్న 14మంది రక్త నమూనాలను సేకరించి, మందులను అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఇందిర, ఎంఎల్‌హెచ్‌పీలు బాలక్రిష్ణ, శిల్ప, లక్ష్మీప్ర సన్న, ఏఎన్‌ఎంలు మంజుల, ఇందిర, సుజాత, కీర్తి, కమల, భూలక్ష్మీ, పంచాయ తీ కార్యదర్శులు ప్రవీణ్, సాయికుమార్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

సిరిసిల్ల టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురువారం గాంధీచౌక్ వద్ద ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, జిల్లా గ్రంథాలయం చైర్మన్ నాగుల సత్యనారాయణ, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్ కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకుడు రాపెల్లి కళ్యాణ్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. స్థానిక సంజీవయ్యనగర్ ప్రాథమిక పాఠశాలలో కేక్ కట్ చేసి విద్యార్థులకు స్వీట్లను పంపిణీ చేశాడు. కాంగ్రెస్ పార్లమెంట్ కోకన్వీనర్ చక్రధర్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, సిరిసిల్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దుబాల వెంకటేశం, ఎండీ ఖాజా, నక్క నర్సయ్య, టీపీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు ఆడెపు ప్రభాకర్, కుడికాల రవికుమార్, వేముల రవి, మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, పద్మశాలి సంఘం సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణ, నాయకులు గుజ్జె రమేష్, నీలి రవీందర్, దొంత దేవదాస్, చందన, రోజా, గుండ్లపెల్లి గౌతమ్, శ్రీశైలం, లక్ష్మన్, యాదగిరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ అయిన సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. టాపాసులు కాలుస్తూ, స్వీట్లు పంచి పెట్టారు. అనంతరం రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ సీనియర్ రాష్ట్ర అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, నాయకులు మల్యాల రాజవీర్, రామచంద్రారెడ్డి, గౌరిశంకర్, కాశీరాములు, లక్ష్మీనారాయణ, వెంకటి, బాలయ్య, రవీందర్, ప్రవీణ్, శంకర్ తదితరులు ఉన్నారు.

● కోనరావుపేట : మండల కేంద్రంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. మండల యూత్ అధ్యక్షుడు బండి ప్రభాకర్, ప్రచార కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుర్ర రవితేజ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, డైరెక్టర్ మేకల ప్రభాకర్ రెడ్డి, రమేష్ రెడ్డి, బుర్ర రవీందర్, దేవరకొండచారి, శోభన్, కార్తీక్, నవీన్ పాల్గొన్నారు.



సిరిసిల్లలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

● చందుర్తి : రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి, ఏఎంసీ వైస్‌చైర్మన్ బొజ్జ మల్లేశం, బచ్చు వెంకటేశం, ధర్మపురి శ్రీనివాస్, దూది శ్రీనివాసరెడ్డి, గొట్టె ప్రభాకర్, సంటి ఏసుదాసు, ముకుందరెడ్డి, రవీందర్‌రెడ్డి, మధు, జలపతి, మల్లేశం పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి గ్రామాల్లో నిర్వహించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, గౌస్, సాహెబ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్, బాలయ్య, రవీందర్, నారాయణరెడ్డి, గిరిధర్‌రెడ్డి, బాబు, బుచ్చాగౌడ్, మల్లారెడ్డి, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రఫీక్, రాజు, రాములు, సంతోష్, వెంకటేశ్, కిషన్, పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలకేంద్రంలోని బస్టాండు ప్రాంతంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, మాజీ ప్యాక్స్‌చైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మామిడి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : మండలకేంద్రంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీటి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ లెంకెల లక్ష్మణ్, హరిలాల్, కాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం పోతుగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కెకె మహేందర్‌రెడ్డిల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఏఎంసీ చైర్మన్ తలారి రాణినర్సింలు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఒరగంటి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : మండల కేంద్రంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, మచ్చ శ్రీనివాస్ పాల్గొన్నారు.

● రుద్రంగి : మండల కేంద్రంలోని ఇందిరాచౌక్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహు ల్‌గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, గండి నారాయణ, కేసిరెడ్డి నర్సారెడ్డి, కోమిరె శంకర్, మాడిశెట్టి అభిలాష్, తర్రె లింగం, దర్న మల్లేశం, ఎర్రం ఆరవింద్, చెలుకల శ్రీకాంత్, పల్లికొండ వినయ్, గండి ఆశోక్, సూర యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్: వేములవాడ రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. అధ్యక్షులు వకుళాభరణం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సోమినేని కర్ణాకర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రోమాల ప్రవీణ్ కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నేదురి రమేష్, గ్రామ శాఖ అధ్యక్షుడే శంకర్, రాధ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.